

# సెప్టెంబర్‌లో ఓజీ?

పవన్‌కల్యాణ్ ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా ఏపీ రాజకీయాల్లో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఆయన ఏ రాజకీయ సభలో పాల్గొన్నా.. అభిమానులంతా 'ఓజీ.. ఓజీ..' అంటూ నినదిస్తున్నారు. వారికి సమాధానం చెప్పలేక పవన్ అసహనానికి లోనైన సందర్భాలు కూడా ఉన్నాయి. సుజిత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ 90 శాతం పూర్తి చేసుకుంది. ఈ సినిమా కంటే ముందే మొదలైన 'హరిహర వీరమల్లు' షూటింగ్‌ని ముందు ముగించి, తర్వాత 'ఓజీ' పని పట్టాలని పవన్ ప్లాన్ చేసుకున్నారట. అందుకే.. ముందు 'హరిహర వీరమల్లు'ను పూర్తి చేసే పనిలో ఉన్నారాయన. నిజానికి ఈ నెల 28నే వీరమల్లు విడుదల కావాలి. కానీ షూటింగ్ ఆలస్యం వల్ల కుదర్లేదు. తాజాగా మే 9 డేట్‌ని ఖరారు చేశారు. ఇక 'ఓజీ' విషయానికొస్తే.. ఈ సినిమాను సెప్టెంబర్‌లో విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. షూటింగ్ పూర్తవ్వగానే డేట్‌ని ప్రకటిస్తారట. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం తమన్.

# రౌడీతో జోడీగా..

'మహానటి' సినిమాతో జాతీయ ఉత్తమనటిగా అవతరించింది కీర్తి సురేశ్. తను ఎన్ని భాషల్లో నటించినా.. ఆమె కెరీర్‌కి మేలి మలుపు మాత్రం తెలుగు సినిమానే . 'దసరా' తర్వాత తెలుగులో ఆమె హీరోయిన్‌గా నటించలేదు. రెండేళ్ల విరామం తర్వాత మళ్లీ తెలుగు సినిమాలకు వరుసపెట్టి సైన్ చేస్తున్నారు కీర్తి సురేశ్. 'బలగం'ఫేం వేణు యెల్దండి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మించనున్న 'ఎల్లమ్మ' సినిమాలో కథానాయికగా ముందు సాయిపల్లవిని అనుకున్నారు. కానీ డేట్స్ అడ్జెస్ట్ కాకపోవడంతో సాయిపల్లవి 'ఎల్లమ్మ'కు ఓకే చెప్పలేకపోయింది. దాంతో ఈ ప్రెస్టేజియస్ ప్రాజెక్ట్‌లోకి కీర్తి సురేశ్ ఎంటరయ్యారన్న వార్త ప్రస్తుతం విస్తృతంగా వినిపిస్తున్నది. దీనితోపాటు మరో ప్రతిష్ఠాత్మక చిత్రంలో కూడా కీర్తి కథానాయికగా ఎంపికైందట. అది కూడా దిల్‌రాజు నిర్మిస్తున్న సినిమానే కావడం విశేషం. అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ హీరోగా 'రాజావారు రాణీవారు'ఫేం రవికిరణ్ కోలా ఈ సినిమా తెరకెక్కించనున్నారు. సినిమా పేరు 'రౌడీ జనార్థన్'. ఏదేమైనా.. పెళ్లయ్యాక తెలుగు తెరకి దూరమైన కీర్తి.. మళ్లీ నిదానంగా టాలీవుడ్‌కి చేరువ కానున్నదన్నమాట.



# సెట్‌లో కనీసం కూర్చోను!

వృత్తివిషయంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తాడని, సమయపాలన అస్సలు ఉండదని, వ్యాయామానికి మాత్రమే ఎక్కువ సమయం కేటాయిస్తారని బాలీవుడ్ అగ్ర నటుడు సల్మాన్‌ఖాన్‌పై గతకొంతకాలంగా ముంబయి మీడియాలో వార్తలొస్తున్నాయి. ఈ విమర్శలపై తాజా ఇంటర్వ్యూలో సల్మాన్‌ఖాన్ స్పందించారు. సుదీర్ఘ కెరీర్‌లో ఇప్పటికే వందకుపైగా చిత్రాల్లో నటించానని, వృత్తి పట్ల అంకితభావం లేకుంటే ఇన్ని విజయాలు ఎలా సాధ్యమయ్యేవని ఆయన ప్రశ్నించారు. 'నా సమకాలీనులెవ్వరూ వంద చిత్రాల్లో నటించలేదు. సెట్‌కి ఆలస్యంగా వచ్చి త్వరగా వెళ్లేవాడినైతే కెరీర్‌లో ఇంత దూరం వచ్చేవాడిని కాదు. మధ్యాహ్నం పన్నెండుగంటలకు సెట్‌కు వచ్చి అర్ధరాత్రి వెళ్లిపోతాను. ఉదయం నా వర్కవుట్స్, వ్యాపార సంబంధమైన లావాదేవీలను చూసుకోవాలి కాబట్టి మధ్యాహ్నం షూట్‌లో జాయిన్ కావడం ఆనవాయితీగా మార్చుకున్నా. ఒక్కసారి నేను సెట్‌లో అడుగుపెట్టానంటే ఆ రోజు షూట్ పూర్తయ్యేవరకు కనీసం కుర్చీలో కూడా కూర్చోను. షాట్ గ్యాప్‌లో క్యారవ్యాన్‌లోకి అస్సలు వెళ్లను. ఆన్‌లొకేషన్‌లో అయితే యూనిట్ వాళ్లు వేసిన టెంట్ కిందే నిల్చొని ఉంటాను. ఈ విషయాలను నాతో పనిచేసిన ఎవరిని అడిగినా చెబుతారు. సెట్‌కి ఆలస్యంగా వస్తాడనే కారణాన్ని చూపుతూ నటుడిగా నా వ్యక్తిత్వంపై దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారు' అని సల్మాన్‌ఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. సల్మాన్‌ఖాన్, రష్మిక మందన్న జంటగా మురుగదాస్ దర్శకత్వంలో రూపొందిన 'సికందర్' నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది.



# నేడే మెగా ఓపెనింగ్.. వెంకీ కూడా ఉన్నారట?



సకల అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటే తప్ప యుద్ధరంగంలోకి అడుగుపెట్టని వీరుడు లాంటివాడు దర్శకుడు అనిల్ రావిపూడి. ఆయన ప్రీప్రొడక్షన్‌కి ఎక్కువ సమయం తీసుకునేది అందుకే.. ముందు కథ పక్కాగా రావాలి. తర్వాత బౌండ్ స్క్రిప్ట్ సిద్ధం కావాలి. పాత్రధారులంతా తన పాత్రలకు సెట్టయ్యేలా అమరాలి. అప్పుడుకానీ లొకేషన్లోకి ఎంట్రీ ఇవ్వరు. ఓ విధంగా అనిల్ విజయాలకు కారణమదే. అలాగే.. సినిమా ప్రమోషన్స్ విషయంలోనూ అనిల్ దూకుడు అలాగే ఉంటుంది. ఎప్పుడూ బయటకు రాని వెంకటేష్‌తోనే ప్రమోషన్స్‌లో స్టెప్పులేయించిన ఘనుడు అనిల్. అవసరమైతే తాను డ్యాన్సులేస్తాడు.. అందరితో వేయిస్తాడు. తాను చేస్తున్న సినిమాపై ఆడియన్స్‌లో హైప్ తీసుకురావడానికి ఎన్ని ప్రయత్నాలు చేయాలో అన్నీ చేస్తాడు. త్వరలో ఆయన చిరంజీవిని డైరెక్ట్ చేయబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో చిరంజీవికి లవ్‌స్టోరీ ఉండదనీ, డ్యూయెట్లు అసలే వుండవనీ.. ఇది పెళ్లీడుకొచ్చిన పిల్లల తండ్రి పాత్రనీ.. అయితే.. మెగా యాక్షన్‌కి, మెగా కామెడీ టైమింగ్‌కి మాత్రం ఢోకా ఉండదని ఇప్పటికే వార్తలు వచ్చేశాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో ఆసక్తికమైన వార్త వెలుగు చూసింది. ఇందులో విక్టరీ వెంకటేశ్ కూడా ఓ కీలక పాత్రలో కనిపిస్తారట. ఆ పాత్ర నిడివి తక్కువే అయినా.. ప్రాముఖ్యత మాత్రం ఎక్కువే ఉంటుందని తెలుస్తున్నది. టాలీవుడ్ ఫోర్ పిల్లర్స్‌గా చెప్పుకునే చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్‌లలో ఏ ఒక్కరూ కూడా మిగతా ముగ్గురు సినిమాల్లో నటించిన దాఖలాల్లేవు. అనిల్ పుణ్యమా అని తొలిసారి ఈ నాలుగు పిల్లర్స్‌లో రెండు పిల్లర్స్ కలిసి స్క్రీన్‌షేర్ చేసుకోనున్నాయి. ఇదే నిజమైతే అభిమానులకు విజువల్ ఫీస్టే. మెగాస్టార్, అనిల్ రావిపూడి సినిమా ఓపెనింగ్ ఉగాది పర్వదినం సందర్భంగా నేడే జరుగనున్నది.






# ఏ సవాలునైనా స్వీకరిస్తా!



సినిమాల ఎంపికలో సొంతంగా నిర్ణయాలు తీసుకుంటానని, ఎవరి సూచనలు..సలహాలు పాటించనని చెప్పింది అగ్ర నాయిక రష్మిక మందన్న. కర్ణాటకలో ప్రకృతి రమణీయతకు ఆలవాలమైన కూర్గ్ ప్రాంతం నుంచి వచ్చిన ఈ సొగసరి సమకాలీన భారతీయ సినిమాలో తిరుగులేని స్టార్‌డమ్‌తో దూసుకుపోతున్నది. నేషనల్ క్రష్ అంటూ అభిమానులు ఆమెను ప్రేమగా పిలుచుకుంటారు. 'పుష్ప' ఫ్రాంఛైజీ, యానిమల్, ఛావా సినిమాలతో ఈ అమ్మడి పాపులారిటీ పతాకస్థాయికి చేరింది. ఆమె సల్మాన్‌ఖాన్‌తో కలిసి నటించిన 'సికందర్' చిత్రం నేడు విడుదలకానుంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో రష్మిక మందన్న కెరీర్‌పరంగా తన ఎంపికలపై ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. 'సినిమాల విషయంలో మన ఎంపికలే మనల్ని గొప్పస్టార్స్‌గా నిలబెడతాయి' అని ఓ పుస్తకంలో చదివిన మాటలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని, వివిధ భాషా చిత్రాల్లో నటించాలన్నది తన స్వీయ నిర్ణయమని, భవిష్యత్తులో మలయాళంలో కూడా నటిస్తానని రష్మిక మందన్న తెలిపింది. కొత్త సవాళ్లను స్వీకరించడానికి ఎప్పుడూ వెనకడుగు వేయనని, తన నిర్ణయాల పర్యవసానాలను తానే ఎదుర్కొంటానని, అంకితభావంతో పనిచేస్తే పోటీతత్వం గురించి ఆలోచించాల్సిన అవసరం ఉండదని చెప్పుకొచ్చింది రష్మిక.



# కొత్త కథలకు వేదిక 'కథాసుధ'

సినీరంగంలో ప్రతిభావంతులను ప్రోత్సహిస్తూ, సరికొత్త కథలను అందించడానికి గొప్ప వేదికగా 'కథాసుధ' నిలుస్తుందని ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు అన్నారు. ఓటీటీ ఛానల్ ఈటీవీ విన్‌లో కథాసుధ పేరుతో ప్రతీ ఆదివారం ఓ చిత్రాన్ని స్ట్రీమింగ్ చేయనున్నారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కె.రాఘవేంద్రరావు మాట్లాడారు. నేటితరంలో అద్భుతమైన ప్రతిభావంతులున్నారని, యూట్యూబ్ వంటి వేదికల్లో తమ సత్తాచాటుతున్నారని, అలాంటి వారికి కథాసుధ ప్లాట్‌ఫామ్ ద్వారా అవకాశాలు కల్పిస్తామని, ఇప్పటికే 30నిమిషాల నిడివిగల నాలుగు సినిమాలను 17రోజుల్లోనే పూర్తిచేశామని ఆయన అన్నారు. తాను చెప్పిన ఐదు కథలను సింగిల్ సిట్టింగ్‌లోనే ఈటీవీ విన్ టీమ్ ఓకే చేసిందని, వాటిని ఇరవై రోజుల్లోనే తీశామని, ఈ కథలన్నీ మర్చిపోలేని అనుభూతులను అందిస్తూ జ్ఞాపకాలను తట్టిలేపుతాయని దర్శకుడు సతీష్ వేగేశ్న తెలిపారు. కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'కుటుంబమంతా చూడదగ్గ కంటెంట్‌తో ఈటీవీ విన్ ప్రేక్షకుల ఆదరణ పొందుతున్నది. కథాసుధ ద్వారా ఇండస్ట్రీకి కొత్త ప్రతిభను పరిచయం చేయడం అభినందనీయం' అన్నారు. కథాసుధ ద్వారా వచ్చే కథలన్నీ మన హృదయాలకు దగ్గరగా ఉంటాయని నటుడు, రచయిత తనికెళ్ల భరణి పేర్కొన్నారు. ఈ కథలు తప్పకుండా ప్రేక్షకుల మనసుల్ని గెల్చుకుంటాయని ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్ చక్రవర్తి అన్నారు.

# మధురమైన టీనేజ్ ప్రేమ



యువజంట ఉదయ్‌రాజ్, వైష్ణవి సింగ్ జంటగా నటించిన టీనేజ్ లవ్‌స్టోరీ 'మధురం'. 'ఎ మెమొరబుల్ లవ్' అనేది ఉపశీర్షిక. రాజేష్ చికిలే దర్శకుడు. ఎం.బంగార్రాజు నిర్మాత. పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా ఏప్రిల్ 18న విడుదల కానుంది. 1990 కాలంలో జరిగే టీనేజ్ లవ్ స్టోరీ ఇదని, అప్పటి స్కూళ్ల వాతావరణం, ఆటలు, అల్లర్లు, గొడవలు ఎలా ఉండేవో నేటి తరానికి కళ్లకు కట్టినట్టు చూపిస్తూ ఈ సినిమాను రూపొందించామని, సాంకేతికంగా సినిమా అభినందనీయంగా ఉంటుందని దర్శకుడు చెప్పారు. 'బస్‌స్టాప్'ఫేం కోటేశ్వర రావు, కిట్టయ్య, ఎస్.ఎం.బాబాయ్, దివ్యశ్రీ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: మనోహర్ కొల్లి, సంగీతం: వెంకీ వీణ, నిర్మాణం: శ్రీవెంకటేశ్వర ఎంటర్టైన్మెంట్స్.

# టెంపరేచర్ కాన్సెప్ట్‌తో తొలి సినిమా



ఇప్పటివరకూ తెలుగులో రానటువంటి వినూత్నమైన కాన్సెప్ట్‌తో '28 డిగ్రీస్ సెల్సియస్' చిత్రాన్ని తెరకెక్కించానని చెప్పారు దర్శకుడు డా|| అనిల్ విశ్వనాథ్. 'పొలిమేర' చిత్రంతో ప్రతిభావంతుడైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారాయన. ఐదేళ్ల క్రితమే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఆయన తొలిచిత్రం '28 డిగ్రీస్ సెల్సియస్' ఏప్రిల్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. నవీన్‌చంద్ర, షాలినీ వడ్నికట్టి జంటగా నటించారు. ఈ సందర్భంగా శనివారం డా|| అనిల్ విశ్వనాథ్ పాత్రికేయులతో ముచ్చటించారు. 2020 మే నెలలో సినిమా రిలీజ్‌కు ప్లాన్ చేశామని, అయితే లాక్‌డౌన్ కారణంగా వాయిదా వేశామన్నారు. ఇద్దరు మెడికల్ స్టూడెంట్స్ మధ్య నడిచే ప్రేమకథ ఇదని, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో పాటు సూపర్ నేచురల్ అంశాలుంటాయని వివరించారు. 'బ్రెయిన్ డ్యామేజీ అయిన వారు ఎక్కువ వేడి, చల్లదనాన్ని తట్టుకోలేరు. మెడికల్ థియరీలో ఉన్న ఈ పాయింట్‌ను సినిమాలో తీసుకున్నాం. 28 డిగ్రీస్ సెల్సియస్ టెంపరేచర్‌ను మాత్రమే తట్టుకునే కథానాయిక పాత్ర చుట్టూ ఈ కథ నడుస్తుంది' అన్నారు. నిర్మాత వంశీ నందిపాటికి ఈ సినిమా నచ్చి రిలీజ్ చేయడానికి ముందుకొచ్చారని తెలిపారు. తన దర్శకత్వంలో 'పొలిమేర 3' త్వరలో సెట్స్‌మీదకు వెళ్తుందని, ఇది పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుందని, వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేస్తామని, బెల్లంకొండ సాయిశ్రీనివాస్‌తో త్వరలో ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ చేయబోతున్నానని డా|| అనిల్ విశ్వనాథ్ పేర్కొన్నారు.





